




# దీనికి పాత సాఫ్ట్‌వేరే పనిచేస్తుంది

జాన్సన్ చోరగుడి

బెజవాడ స్టేషన్లో దిగాను. దారి పొడుగునా నాతోనే ఉన్న వాన నాతోపాటు ఈ ఊర్లోనూ దిగింది. హోటల్ గదికి చేరి ప్రయాణ బడలిక తీర్చుకొని బయటకొచ్చేసరికి సాయంత్రం ఆరయింది. లైట్ల వెలుతురులో ఊరు చిత్రంగా అన్పించింది.

ఎటుచూసినా అన్నింటా కొత్త ముస్తాబే- ఎటొచ్చీ ఏదీ పూర్తికాకపోవడం అన్నీ సగం సగం పూర్తయినట్టు.

ఒక్క ఊరినేకాదు, దేన్నయినా- చివరికి మనుష్యుల్ని అయినా- ఇలా చూడాలంటే ఇబ్బందే. అయితే, ఇంతకు ముందు ఉన్నట్టు అయినా ఫర్వాలేదు, లేకుంటే జరుగుతున్న మార్పు ఏదో అది పూర్తి అయ్యాక చూసినా ఫర్వాలేదుగాని ఏదీ ఒక తీరు అంటూ లేకుండా పడుతూలేస్తూ చేసే ఈ సగంసగం పరుగు వంటి నడకంటే ఎందుకో చెప్పలేనంత చిరాకు. వాన వెలిసింది. సన్నటి గాలి వీస్తోంది. రోడ్డుకు అవతల వున్న వైన్‌షాపు కిటకిటలాడుతూ ఉంది. దాని ముందు ఆగి ఉన్న రకరకాల మోటారు సైకిళ్లు, స్కూటర్లు- మధ్య తాగిపడేసిన డిస్పోజబుల్ గ్లాసులు గాలికి తారురోడ్డు మీద ఊగిసలాడుతున్నాయి. అటే చూస్తున్నాను. షాపు లోకి, బయటికి బొంగరంలా తిరుగుతున్నాడు, పొడుగు నిక్కరు వేసుకొన్న ఒక పొట్టివాడు. సన్నగా రివటలా ఉండి షాపు ముందు ఎర్రటి మాంసం వేలాడదీసుకొని ఉన్న బండి దగ్గరకు వచ్చి ఏవేవో తీసుకొని లోనికి వెళుతున్నాడు. పంపు క్రింద తడిసిన పిచ్చుకలా ఉన్న వాడి వయసు పోల్చుకోవడం కష్టం అన్పించింది. ఎందుకో- ఇటువంటివాళ్ల పెళ్లాలు వీళ్లను ఎలా చూసుకొంటారో అన్పించింది. అతన్ని చూసినప్పుడు అలా ఎందుకు అన్పించిందో నాకూ తెలీదు.

పెళ్లి ముహూర్తం ఎప్పుడో రాత్రి రెండు తర్వాత. ఏ ఎనిమిది గంటలప్పుడో వెళ్లి కన్పించి వస్తే సరిపోతుంది. వచ్చిన పని అయిపోయినట్టే. నడుస్తున్నాను. ఇరవై ఏళ్లు దాటిపోయి ఉండవచ్చు ఈ ఊరు వచ్చి. ఎప్పుడో రంగా హత్య తదనంతరం జరిగిన గొడవలకు ముందు ఒక మిత్రుడి పెళ్లికి రావడమే. మళ్లీ ఇప్పుడూ పెళ్లికే. నిజానికి దీనికి వాసంతి రావల్సింది. ఇది తన స్నేహితురాలి కూతురు పెళ్లి. ఇవ్వాళే తన డిజర్టేషన్‌కి యూనివర్సిటీలో వైవా ఉండడంతో, హిందూపురం నుండి తను బెంగుళూరుకు ఆమె తరఫున నేను బెజవాడకు రావల్సి వచ్చింది. ఫుట్‌పాత్ మీద నడుస్తున్నాను. వరుసగా చెప్పుల దుకాణాలు. లీలగా బాగా పరిచయమున్న చోటికి వచ్చినట్లు అన్పించి నడక ఆగిపోయింది.

ఎదురైన అతన్ని అడిగాను.

"అలంకార్ థియేటర్ ఎక్కడ?"

అతడో క్షణం నా ముఖంలోకి చూసి ఎదురుగా ఉన్న అలంకార్ చూపించాడు- సర్దు కొని, "బుక్‌షాప్స్... ఓల్డ్ బుక్‌షాప్స్... లెనిన్ సెంటర్ ఎక్కడ?"

"కుడికి తిరిగి వంతెన దాటాలి," అతను వెళ్లిపోయాడు.

అలంకార్ వైపు చూశాను. చాలా పెద్ద కాంప్లెక్స్ అయిపోయింది. కొన్నాళ్ల క్రితం ఇక్కడ్నించి వచ్చిన ఎవరో చెప్పినట్టు గుర్తు- ఇప్పుడు పుస్తకాల షాపులు అన్నీ ఒకేచోట లెనిన్ సెంటర్లో పెట్టారని. వంతెన దాటాను. కుడివైపున వరుసగా బారులు తీరినట్టు ముందు పూలదండల దుకాణాలు తర్వాత పుస్తకాలు. పూలూ పుస్తకాలు ఒక్కచోటే! వాన వల్లనేమో దుకాణాల

వద్ద పెద్దగా అలికిడి లేదు. ఖాళీగా ఉన్నాయి. వాటిలోకి చూసుకొంటూ వాటి ముందే నడుస్తున్నాను. మధ్య మధ్యలో చిన్నచిన్న గుంటల్లో నిలిచిన వాననీటిని దాటుకొంటూ ఇనుప ర్యాకుల్లో నిలువుగా సర్దిన పుస్తకాల వెన్నుల మీద ఉన్న పేర్లను పైపైనే చూస్తూ ముందుకు నడుస్తున్నాను. ఎక్కువ కంప్యూటర్ లాంగ్వేజ్‌వి, ఇంజనీరింగ్‌వి, మిగతా కోర్సుల టెక్స్టులు, గైడ్లు కన్పిస్తున్నాయి. బేరాలు లేకపోవడంతో కొందరు పక్క షాపుల వాళ్లతో బాతాఖానీల్లో ఉన్నారు.

ఒకరిద్దరు 'ఏమి కావాల్సార్,' అంటూ పలకరించారు. నేను చిరునవ్వు నవ్వుతూ చేత్తో చిన్నగా ఏమీవద్దు అన్నట్లు వాళ్లను దాటుకుంటూ ముందుకు కదిలాను. ఒక షాపును దాటబోతూ కుడికాలిని ముందుకు వేయబోయి ఎదురుగా ఉన్న నీటిగుంటను, అదే క్షణంలో ఎదురుగా ఉన్న షాపులో వెలుగుతున్న బల్బు క్రింద ఉన్న చలం మైదానం రెండింటినీ ఒక్కసారే చూసి అడుగు వెనక్కి వేశాను.

షాపు ముందు వేసి ఉన్న పాత కొబ్బరిపీచు పట్టా మీద బూట్ల కాళ్లు శుభ్రంగా తుడుచుకొని లోపలికి వెళ్లాను. మధ్యలో గుమ్మానికి తలుపులు లేవుగాని ఆ షాపు రెండు గదులుగా ఉంది. షాపతను కాబోలు లోపలిగదిలో గుమ్మానికి ఎదురుగా స్టూలుమీద కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు. అతను మాట్లాడుతున్న ఆ రెండవ మనిషి బయటకు కన్పించడం లేదు. నన్ను చూసి అతను లేవబోతూ ఏమి కావాలని అడుగకముందే అతన్ని చేత్తో వారిస్తూ నా చూపును మైదానం ర్యాక్‌వైపు తిప్పాను. మైదానం పక్కన దైవమిచ్చిన భార్య- చేతిలోకి తీసుకొన్నాను. అట్ట కొత్తగానే ఉంది. లోపలి పేజీలు మాత్రం నీర్కావి రంగులో ఉన్నాయి. అంటే ఎవరో చదివేసిన పుస్తకం కాదుగాని పాత స్టాక్ అన్పించింది. ప్రింటులో వెల ముప్పై అయిదు రూపాయలుంది. దాని పక్కన, పెన్సిల్‌తో ఐదు అని వేసి ఉంది. బేరం చేయకుండానే ఐదుకు ఇచ్చేస్తారన్నమాట. ఆ ర్యాక్‌లో ఇంచుమించు అన్నీ అటువంటి పుస్తకాలే ఉన్నాయి. అక్కడే ఓ అరగంట గడిపాను. ఒకటి రెండు పుస్తకాలు తీసుకొన్నాను.

ఇంతలో వైన్‌షాపు దగ్గర అంతకు ముందు చూసిన, 'పంపు క్రింద తడిసిన పిచ్చుక'- "సముద్రాలు గారూ, సముద్రాలుగారూ," అంటూ వేగంగా షాపులోకి వచ్చాడు. అప్పుడు అతన్ని నేను దగ్గరగా చూశాను.

"హరినారాయణగారు మా బోస్‌గారికి ఫోన్ చేశారండి. మిమ్మల్ని ఎనిమిది గంటలకి బృందావన్ సెంటర్లో ఉండమన్నారంటండి. ఆయ్ నేను ఎల్తన్నానండి," అంటూ లోపలి గదిలో ఉన్న నాకు కనిపించని ఆ రెండవ మనిషికి కబురుచెప్పి బయటకు నడుస్తున్నాడు. అతన్ని చూస్తే నాకెందుకో అప్రయత్నంగా నవ్వు వచ్చింది. చిన్నగా నవ్వాను. తనూ నవ్వుకొంటూ వెళ్లిపోయాడు. ఎందుకు నవ్వావని అతడు నన్ను అడగలేదు. నేను ఎందుకు నవ్వానో నిజానికి నాకూ తెలీదు.

ఆ షాపులో గైడ్లు, టెక్స్ట్ పుస్తకాల ర్యాకుల మధ్య సాహిత్యసంబంధమైన పుస్తకాలున్న ర్యాక్ అదొక్కటే. అందులోనే ఒక అరలో ఒకమూల నాటకాల పుస్తకాలు ఓ డజనుదాకా ఉన్నాయి. 'పొయిట్రీ... సముద్రాలు... పుస్తకాలు... సముద్రాలు... ఎక్కడున్నా... సము ద్రాలు... ఉన్నాయా? సముద్రాలు.' అవును ఇది నాకు బాగా పరిచయం ఉన్న పేరు కాదూ? అవును ఇది బెజవాడ కదా? నేనున్నది పాత పుస్తకాల షాపు. నాకు బాగా పరిచయం ఉన్న పేరు. ఎవరీ లోపలి గదిలో ఉన్న సముద్రాలు?

గుమ్మం వద్ద నిలబడి లోపలికి వంగి చూస్తూ, "మీరేనా సముద్రాలు?" అడిగాను.

స్టూలు మీద కూర్చున్న అతను ముందు గదిలోకి వచ్చాడు.

"ఎవరండీ?" తనే అడిగాడు.

ఈ సముద్రాలు ఎక్కడో అమృతం తాగినట్టున్నాడు.

ఏ మార్పూ లేదు. మనిషి కొంచెం గుండ్రమైనునుపు తేలడం తప్ప. నేనైతే అతన్ని పోల్చాను.

## 2

పందొమ్మిది వందల డెబ్బయి ఒకటి నాటి రోజులవి. నేను బెజవాడ ఆంధ్ర లయోలా కాలేజీలో ఇంటర్మీడియెట్‌లో చేరాను. స్వంత ఊరు ఆదోని అయినా నేను అక్కడ ఉండడం నాకు తెలీదు. నాన్న ఆ ఏడాది నిర్మల్ నుండి రాజాంకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. బి.డి.ఓ. ఆఫీసులో సీనియర్ క్లర్కుగా చేసేవారు నాన్న. అప్పట్లో చిన్న ఉద్యోగాలకు కూడా రాష్ట్రస్థాయి ట్రాన్స్‌ఫర్లు ఉండేవి. ఈ కాలేజీలోనే నేను చదవాలని రాజాం నుండి నన్ను బెజవాడ పంపారు. మొదటి ఏడాది సగం గడిచేసరికి కొందరు సీనియర్లు పరిచయం అయ్యారు. వాళ్లతో కలిసి ఆదివారాలు బయటకు వెళ్లేవాణ్ణి. అలా వెళ్తూవెళ్తూ క్రమంగా నా వెతుకులాట ఒకచోట ఆగిపోయింది. ఇక అంతే! బి.ఎ. ఫైనలియర్ అయ్యేంత వరకు ఆ అయిదేళ్లు బెజవాడలో ఉంటే మాత్రం ఆది

వారం ఒక గంటయినా అక్కడ గడపాల్సిందే. అదే సముద్రాలు పాత పుస్తకాల షాపు.

షాపంటే అదేం పెద్ద షాపేం కాదు. అలంకార్ సినిమాహాలు ఎదురుగా ఉన్న షాపుల మలుపు ముందు ఫుట్‌పాత్ మీద ప్రతి ఆదివారం ఉదయం తొమ్మిదికల్లా ఠంచనుగా చుట్టూ పుస్తకాలు సర్దుకొని వాటి మధ్యలో కూర్చుని ఉండేవాడు సముద్రాలు. తన షాపు వద్దకు వచ్చే మా కాలేజీ వాళ్లంతా తనకు తెలుసు. వాళ్లను పేర్లుపెట్టి చివర 'గారు' తగిలించి మరీ పిలిచేవాడు. మాలో ఎవరికైనా తను గారు జోడించి పిలిచిన ప్రతిసారీ మావాళ్లు అతణ్ణి ఆట పట్టించేవాళ్లు. 'మీరు లయోల కాలేజీ స్టూడెంట్లండీ, మిమ్మల్ని పేరు పెట్టి ఎలా పిలుస్తాం,' అనేవాడు. తను పియుసి మధ్యలో ఆపేసి ఇంట్లో తనకంటే చిన్నవాళ్ల చదువుల కోసం ఈ పని చేస్తున్నానని అనేవాడు. ఎవరైనా ఏదైనా పుస్తకం అడిగితే తన వద్ద అది లేకపోతే ఒక నోటు పుస్తకంలో రాసుకొని మరో వారం పదిరోజుల్లో మొత్తానికి ఎలాగోలా దానిని సంపాదించి మరీ ఇచ్చేవాడు. మా ఇంట్లో నాన్నవి ఏవో కొన్ని పుస్తకాలు ఉన్నా అప్పటివరకూ క్లాసు పుస్తకాలకే పరిమితమైన నా చేత- కవిత్వం, కథలు, నవలలు చదివించింది మాత్రం సముద్రాలు. ప్రతి వారం కొన్ని కొత్త (పాత) పుస్తకాలు తెచ్చేవాడు.

బి.ఎ. రెండవ సంవత్సరం చదువుతున్నాను. ఒక డిసెంబర్ ఆదివారం సముద్రాలు షాపుకెళ్లాను. నేను వెళ్లేసరికి పుస్తకాలు సర్దుకొంటున్నాడు. నన్ను చూసి నవ్వాడు. 'మీకోసమే చూస్తున్నాను. రండి,' అన్నాడు. కూర్చున్నవాడల్లా లేచి తను డబ్బులు పెట్టుకొనే బాక్సు క్రింద ఉంచిన ఒక ఇంగ్లీషు పుస్తకం పైకి తీశాడు. గబగబా ఒక మూల పేజీ మడతపెట్టి ఉంచిన చోట పుస్తకం తెరిచాడు. అందులో ఒక పేరాలోని పంక్తి వద్ద చూపుడువేలితో చూపిస్తూ ఇది చదవండి అని నా చేతికిచ్చి తన పనిలో తాను పడిపోయాడు. నేను దానిని తీసుకొని పుస్తకాలు చూసుకొనేవాళ్లకు అడ్డు లేకుండా కొంచెం అవతలకు వెళ్లి, ఒక కాలు మడిచి గోడకు ఆనించి నడుం గోడకు చేర్చి కాస్త రిలాక్స్‌డ్‌గా పుస్తకం విప్పాను.

డిసెంబర్ చివరివారం ఎండ ఒకలాటి వెచ్చదనాన్ని అందిస్తూ ఉంది. అది డిగ్రీ మొదటి ఏడాది ఇంగ్లీష్ నాన్ డీటైల్డ్ పుస్తకం. వేలుపెట్టి ఉంచిన పేజీ తీశాను. ఆ పేరాలో తను చూపించిన వాక్యం చూశాను. ఆ వాక్యం ఇలా మొదలైంది- 'ఎట్ లాస్ట్ యు హేవ్ బికమ్ మైన్,' అయితే దాన్లో మైన్ అనే పదం క్రింద పెన్సిల్‌తో అండర్‌లైన్ చేసి ప్రక్కన మార్జిన్‌లో- 'గని' అని రాసి ఉంది. అంతే- అది పట్టుకొని ఎంతసేపు నవ్వుకొంటూ అలా ఉండిపోయానో నాకే తెలీదు. సెకండ్ హ్యాండ్ పుస్తకాల్లో అక్కడక్కడా కన్పించే ఇటువంటి కామెడీ ఆఫ్ ఎర్రర్స్ సముద్రాలు పని కట్టుకొని మరీ నాకు చూపించేవాడు. హాస్యంలో కూడా అతనిలో వున్న అభిరుచి స్పష్టంగా కన్పించేది.

సముద్రాలు షాపు దగ్గర ప్రతి ఆదివారం ఒకతను తప్పనిసరిగా కన్పించేవాడు. మనిషి కాస్త సన్నగా పొడవుగా ఉండి బలహీనంగా, కొంచెం పాలిపోయినట్టుగా ఉండేవాడు. దానికి తగ్గట్టు వదులైన పొడుగు చేతుల చొక్కాలు వేసుకొనేవాడు. సముద్రాలు షాపుకు కొంచెం అవతల చెప్పులషాపు మెట్లమీద మూసి ఉండే షట్టరుకు ఆనుకొని ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూ కన్పించేవాడు. అతను ఎప్పుడూ ఎవరితో మాట్లాడ్డం నేను చూళ్లేదు. అప్పుడప్పుడూ దగ్గర్లో ఉండే టీషాపు వద్ద తనతోపాటు సముద్రాలుకు కూడా గాజు గ్లాసుతో టీ తెచ్చేవాడు. మళ్లీ అక్కడే కూర్చుని చదువుకొనేవాడు.

సముద్రాలు వద్ద నాకు బాగా చనువు పెరిగాక ఒకసారి అడిగాను, 'ఆయన ఎవర'ని. ఈమధ్య ఆయన తరచూ దగ్గుతూ కన్పిస్తున్నాడు. 'తర్వాత చెబుతానులే,' అని క్లుప్తంగా ముగించాడు. తనెందుకో అలా ముక్తసరిగా జవాబు ఇవ్వడంతో నేను మళ్లా ఆ విషయం తనని అడగలేదు. సముద్రాలు ఒక్కొక్కసారి కొన్ని అరుదైన పుస్తకాలు తెచ్చేవాడు. ఎవరో దాన్ని అడిగారని వాళ్లకు వచ్చేవారం ఇస్తానని చెప్పానని మీరు చదివి వచ్చేవారం పట్టుకురండి అని నాకిచ్చేవాడు.

ఒకరోజు ఖాళీగా ఉన్న చెప్పులషాపు మెట్టు చూపిస్తూ,

''మీ టీ పార్టనర్ ఏడీ కన్పించడంలేదు,'' సముద్రాలును అడిగాను.

కూర్చున్నవాడల్లా చటుక్కున లేచి వచ్చి నా చేతులు పట్టుకొని పక్కన నీడలోనికి తీసుకువెళ్లి, ''బాబూ అమరేంద్రా, ఆయనింక లేరయ్యా,'' అన్నాడు.

నాకు విషయం అర్థంకాలేదు. అది తాను గ్రహించాడు. చెప్పడం మొదలెట్టాడు.

''ప్రతి ఆదివారం నా దగ్గర తనకు కావాల్సిన పుస్తకాలు చదువుకోవడం కోసం అతను తెనాలి నుండి పొద్దున ప్యాసింజరు రైల్లో ఇక్కడికొచ్చేవాడు. ఆ ఊళ్లో తను ఒక హోటల్‌లో సప్లయర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం హోటల్‌కు సెలవు కదా అందుకని. అతన్ది

ఇక్కడ కాదు మెడ్రాసు. పేరు వరదరాజన్, అరవతను. తెనాల్లో తెలుగు నేర్చుకొన్నాడు. జబ్బుపడ్డాడు. టి.బి. అనుకొంటా. చిన్న వయస్సే. భార్యాపిల్లలు తప్ప ఇక్కడ ఎవరూలేరు. ఒంటరివాడు. పోయిన సోమవారం పోయాడు. తెలిసి వెళ్లి వచ్చాను. నేను నీకిచ్చిన కథల సంకలనం ఉందే, అది అతను రాసిందే.''

షాపు దగ్గర ఎవరో తనకోసం కనిపెడుతుంటే సముద్రాలు నా చేతులు వదిలి వెళ్లిపోయాడు.

బెజవాడలో చదివిన ఐదేళ్లలో లయోలా కాలేజీ ప్రాంగణంలో డిగ్రీ తీసుకొంటే సముద్రాలు పాత పుస్తకాల షాపు వద్ద ఆ డిగ్రీకి సమాంతరంగా జీవితావగాహనలో మరో డిగ్రీ నాకు దొరికిందేమో అని ఆ రోజులు తలుచుకొంటుంటే ఇప్పుడనిపిస్తుంది.

ఊహకందని రీతిలో- మళ్లీ ఇప్పుడు నా చేతుల్లో సముద్రాలు చేతులు.

## 3

కల్యాణమంటపంలో వాసంతి స్నేహితురాలు నీరజను కలిసి తను పెళ్లికి రాలేకపోయిన కారణం చెప్పి వధూవరులను ముహూర్తానికి ముందే అభినందించి, కొంత సమయం గడిపి సముద్రాలుతో కలిసి హరి నారాయణని కలవడానికి బృందావన్ సెంటర్‌కు బయ ల్దేరాను. పెళ్లిలో చెప్పాడు, సముద్రాలు ఆయన గురించి నాకు. నాకు ఆయన్ని కలవాలన్పించింది. నా సెల్‌ఫోన్ నుంచే చెప్పాడు సముద్రాలు- ఒక పాత మిత్రుణ్ణి పరిచయం చేయడానికి తీసుకువస్తున్నానని. రోడ్డు మార్జిన్లో ఇద్దరం నిలబడ్డాం.

''ఎందుకు ఇది బృందావన్ సెంటర్,'' సముద్రాలును అడిగాను.

''ఒకప్పుడు ఆ పేరుతో ఇక్కడ ఒక హోటల్ ఉండేది.''

''ఇప్పుడు...''

''రోడ్లు వెడల్పు చేశారు, అది పోయింది. దాని స్థానంలో ఈ ఫర్నీచర్ షోరూం వచ్చింది.''

''అంటే ఇది ఏలూరు రోడ్డు అవునా! నవోదయ... విశాలాంధ్ర... ఓహ్ నేనిప్పుడు ఆ రోడ్డులో ఉన్నానా.''

సముద్రాలు నవ్వుతూ మా ముందుకొచ్చి ఆగిన రిక్షాలోంచి దిగుతున్న వ్యక్తికి చేయి ఆసరాగా అందిస్తూ, ''హరినారాయణగారు,'' అంటూ ఆయన్ని నాకు పరిచయం చేశాడు.

నమస్తే అని నేనంటుంటే ఆయన షేక్‌హ్యాండ్ ఇస్తూ-

''అదే ఇప్పుడు వచ్చిపడిన అవాంతరమంతా. పుస్తకాల షాపులు అగ్గిపెట్టెలా చిన్నవై పోతున్నాయి. లేదా హారతి కర్పూరంలా ఆవిరైపోతున్నాయి. సార్‌ని నాకు పరిచయం చేయ లేదు,'' దిగుతూనే మొదలు పెట్టి సముద్రాలును తప్పుపట్టాడు హరినారాయణ.

నేను సముద్రాలును కళ్లతోనే వారించి-

''సర్ నేను అమర్- మైసూరు నుండి వచ్చాను.''

''అమరేంద్ర, మీరొక్కరే మన తెలుగు పుస్తకాల గురించి ఇంగ్లీషు పత్రికలో ఇంత కాలంగా సమీక్షలు రాస్తున్నది. మీబోటి వాళ్లు మన మోడ్రన్ క్లాసిక్స్ కొన్ని ఇంగ్లీషులోకి తర్జుమా చేయాలండీ. చెయ్యగలిగిన వారు మీరు కూడా పూనుకోకపోతే ఆ పని ఇంకెవరు చేస్తారు చెప్పండి. ఆఁ నేనన్నానని కాదు. అవునా, కాదా?''

ఈయనకేం క్రొత్తా పాతా ఏమీ ఉన్నట్టు లేదే అన్పించింది. ముగ్గురం ప్రక్క వీధిలోకి తిరిగాం. ఆయన అక్కడ ఆగి వీధి మొదట్లో ఉన్న బడ్డీకొట్లోకి చూస్తూ ఎవర్నో, 'రేయ్,' అన్నాడు.

అక్కడ పనిచేస్తున్న పదిహేనేళ్ల కుర్రాడు పరుగెట్టుకొచ్చి గోల్డ్‌ఫ్లేక్ కింగ్‌సైజు ఇరవై సిగరెట్ల పెట్టి తెచ్చి ఇచ్చి వెళ్లిపోయాడు. మీకేమన్నా కావాలా అని నన్ను అడిగాడు.

అక్కర్లేదు అని చెప్పాను.

ఇప్పుడు ఆయన్ని పరీక్షగా చూశాను. మనిషి సన్నగా పొడువుగా ఆరుకు కొంచెం తక్కువ ఉంటాడేమో. దువ్వని నొక్కుల జుట్టు, తెలుపు నలుపు కలిసిన మాసిన గెడ్డం. వయస్సు తెలీడంలేదు. ఇస్త్రీ చేయని తెల్లటి హాఫ్‌హ్యాండ్ షర్టు, ఏదో ముదురురంగు ప్యాంట్. మాట్లాడిన ప్రతిసారీ మనిషి నవ్వినట్టే అన్పిస్తుంది.

ముగ్గురం నడుస్తున్నాం.

''ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో పెళ్లుంది. నేను రాన్లే, నువ్వెళ్లు అని రేణుకను అటు పంపి నేనిటు వచ్చా.'' మళ్లీ సంభాషణ హరినారాయణే మొదలెట్టాడు.

చిన్నగా నవ్వి, ''ఆ పెళ్లికే అమర్‌గారొచ్చింది. మేమిద్దరం అటెళ్లి అక్కడ కన్పించి మీకోసం తిరిగొచ్చాం,'' సముద్రాలు అన్నాడు.

''మనదెంతో చిన్న ప్రపంచం! ఏవండీ అమరేంద్ర,'' ఆ నవ్వుకి కళ్లు మూసుకుపోతున్నాయి. ఆయన అంటున్న తెలుగు క్లాసిక్స్ ఆంగ్ల తర్జుమా గురించే

నేనింకా ఆలోచి స్తున్నాను. మమ్మల్ని డిస్టర్బ్ చేశానను కొన్నాడేమో, మళ్లీ ఆయనే అన్నాడు.

''మరేంలేదు ఈ రాత్రికి గోపీచంద్ తత్త్వవేత్తలు ప్రింటుకెళ్లాలి. కవర్‌పేజీ డిజైన్ కొంచెం తేడా వచ్చింది. నేనేమో మన తిలక్‌తో- చుట్టూ ఫిలాసఫర్ల ఫోటోలు పెట్టి మధ్యలో చంద్ర వేసిన గోపీచంద్ లైన్ డ్రాయింగ్ బొమ్మ కొంచెం పెద్దది పెట్టమన్నాను. తీరా ప్రూఫు చూస్తే అందరి బొమ్మలు ఒకే సైజులో ఉన్నాయి. సరే ఎందుకైనా మంచిది ఒకసారి దగ్గరుండి చూసుకొని మరీ ప్రింటుకిస్తే మంచిదని నీకోసం కబురుపెట్టాను.''

అంతకుముందే సముద్రాలు నాతో అన్నాడు. ఇల్లు ఒకటి కొనుక్కొన్నానని, దాన్లోనే కొడుకు తిలక్ కంప్యూటర్ పెట్టుకొని ఫోటోషాప్ వర్క్ చేస్తాడని. ఇప్పుడు బెజవాడ నుండి పబ్లిష్ అయ్యే పాత పుస్తకాల రీప్రింట్లకు చాలావరకు కవర్ డిజైన్లు తన కొడుకు చేసినవేనని చెప్పాడు.

చిన్న సందులాంటి వీధిలో ఓ గేటు ముందు ఆగాం. రోడ్డుమీద మూడు నాలుగు బైక్‌లు, స్కూటర్లు ఉన్నాయి. వాటిని దాటుకొని కాంపౌండు లోపలున్న చిన్న పోర్టికోలోకి నడిచాం. ఎదురుగా ఉన్న గదిలో కంప్యూటర్ ముందు కూర్చుని ఉన్నాడు సముద్రాలు కొడుకు తిలక్. వయస్సు ముప్పైలోపే ఉండవచ్చు. చుట్టూ ఐదారుమంది కూర్చుని వున్నారు. హరి నారాయణని చూసి లేవబోయాడు.

''నీపనయ్యాక పిలువు, నేను పైన కూర్చుంటా,'' అంటూ పక్కనే ఉన్న మెట్లమీదకి దారితీశాడు. అసలే శరదృతువేమో, వాన వెలిసిన తర్వాత పుచ్చపువ్వులా కాస్తున్న వెన్నెల్లో కన్పిస్తున్న ప్రతిదీ మెరుస్తున్నట్టే ఉంది. క్రింద ఉన్న కొబ్బరిచెట్లు ఆ వెన్నెల్లో డాబా మీదకు వంగి మరీ తలల తడి ఆరబోసుకొంటు న్నాయి.

సముద్రాలు పైన కుర్చీలు, ఒక చిన్న స్టూలు వేయించాడు. కూర్చున్నాం.

''మీ మైసూరులో పబ్లిషింగ్ యాక్టివిటీ ఇక్కడ కంటే ఇంకా మెరుగ్గా ఉండి వుండవచ్చుకదా,'' హరి నారాయణ అన్నాడు.

ఒక్క క్షణం విరామం తీసుకొని, ''ముద్రణకు ముందు పనికి సంబంధించినంత వరకు ఇక్కడి కంటే ఇంకా మెరుగైన పరిస్థితే ఉంది. కమర్షియల్ మార్కెట్ తన ప్రింటింగ్ అవసరాల కోసం అందుబాటులోకి తెచ్చుకొన్న ప్రతి మౌలిక వసతిని అక్కడి పుస్తక ప్రచు రణకర్తలు కూడా పూర్తిగా వినియోగించుకొంటున్నారు. ఇక కన్నడ కాల్పనిక సాహిత్య ప్రచురణ ఉధృతి ముందు మాత్రం మనం అస్సలు నిలువలేము.

''అయితే ఇక్కడ మాత్రం నాకు విలక్షణంగా కన్పిస్తున్న అంశమొకటి ఉంది. నలుగురు నాలుగు చేతులేసి ఒక మిత్రుడి కూతురు పెళ్లి చేసినట్టు, ఒక పబ్లిషర్ తీసుకు రావాలనుకొన్న పుస్తకాన్ని కూడా అంతే పరస్పర సహకారంతో నలుగురు కలిసి దాన్ని బయ టకు తీసుకురావడం చాలా బావుంది. ఇది పుస్తక ప్రచురణ విషయంలో ఈ ఊళ్లో మీలో ఇంకిపోయిన 'సెంటిమెంట్' లాంటిదేమో అన్పిస్తుంది. నిజానికి మీరు పుస్తకాలు తీసుకురావడం మానేసి దాదాపు పదేళ్లుపైన అయిందట, సముద్రాలు చెప్పాడు. అయినా ఒక మిత్రుడు తెస్తున్న పుస్తకాల కోసం మీరంతా దానిని మీ స్వంత పనిలా పూనుకొని చేస్తు న్నారు. ఇదెలా సాధ్యమవుతుందో నాకు అర్థం కావడం లేదు. ఒక సాహిత్యాభిమానిగా నాకీ నేపథ్యం తెలుసు కోవాలని ఉంది.''

ఆ తడి వెన్నెల వాతావరణంలో మాట్లాడుతూనే ముగ్గురం సముద్రాలు ఇంటిలో నుండి పంపిన పొగలు చిమ్మే వేడి ఫిల్టరు కాఫీ తాగాము. నేను నా మాటలు ముగించేసరికి హరినారాయణ కాళ్లు రెండూ మెలివేసి వాటిని బార్లా ముందుకు చాపి, కుర్చీలో వెనక్కి చేరబడి చేతులు రెండూ కట్టుకొని కళ్లు మూసుకొని ధ్యానంలో ఉన్నవాడిలా కొంతసేపు అలాగే ఉండిపోయాడు. వాన వెలిసిన తర్వాత ఆలస్యంగా విచ్చుకొంటున్న పెరట్లోని నైట్‌క్వీన్ పరిమళాలు ఆ చిత్తడి వాతావరణంలోకి మంద్రంగా వ్యాపిస్తున్నాయి. కాసేపు అలాగే ఉండి పోయిన హరినారాయణ సర్దుకొని చెప్పడం మొదలు పెట్టాడు.

''ఇంకా ఇంకా మూలాలలోకి అంటే ఇప్పుడు నేను వెళ్లనుగాని, ఒక విషయం చెబుతాను. ఇక్కడికి దగ్గర్లో ఉయ్యూరు అని ఒక ఊరు ఉంది. పేరు వినే ఉంటారు. బందరు కాల్వ ఆ ఊళ్లో నుంచి వెళ్తుంది. అక్కడున్న లాకుల్ని ఉయ్యూరు లాకులంటారు. దానికి కొంచెం అవతల మంటాడ అని ఒక ఊరుంది. ఆ ఊళ్లో బందరు కాల్వ మీద దట్టంగా చెట్లు కమ్ముకొని ఉన్నచోట ఒక గూడు పడవ కొన్ని రోజుల పాటు అక్కడ ఆగుతూ ఉండేది. ఒక యువకుడు ప్రతిరోజూ చీకటి పడ్డాక ఏదో ఒక బరువైన సంచి ఒకటి తెచ్చి దాన్ని ఆ పడవలోకి చేర్చి అక్కణ్ణించి ఎవరి కంటా పడకుండా వెళ్లిపోయేవాడు. అలా కొన్నాళ్లు గడిచింది. ఆ తర్వాత ఆ పడవ తెరచాప పైకెత్తుకొని పయనం మొదలు

పెట్టింది. ఇటు ఉయ్యూరు లాకుల వరకు అటు గుడ్ల వల్లేరు లాకుల వరకు విరామం లేకుండా నెమ్మదిగా రాత్రి, పగలూ అలా నడుస్తూనే ఉండేది. ఆ పడవ మధ్యలో యలమర్రు దగ్గర కాసేపాగేది. అక్కడ పడవలోకి భోజనాలు, ఫలహారాలు చేరేవి. మళ్లీ ఉత్తుత్తి రవాణా. రాత్రిపూట పడవలో కిరోసిన్ లాంతర్లు వెలిగేవి. పడవలో వంతులువారీగా ఐదారు మంది రాత్రీ పగలూ పనిచేసేవారు.

"ఇక ఇక్కడ బెజవాడలో వాళ్లు ముద్రిస్తున్నది ఏమిటో ప్రెస్‌వారికే తెలియని విధంగా ఏవో కొన్ని ఫారాలు ఒక ప్రెస్సులో ప్రింటయ్యేవి. అలా నాలుగైదు ప్రెస్సులు. ఒక్కొక్క ప్రెస్ నుండి ఆ ఫారాలు రహస్యంగా కాల్వ మీద ఉన్న పడవలోకి చేరేవి. ఎవరికీ ఎటువంటి అనుమానం రాకుండా ఆ పడవ నడుస్తూనే ఉండేది.

"బెజవాడ నుండి తీసుకెళ్లిన బైండర్లు నడు స్తున్న ఆ పడవలో కూర్చుని ఆ ఫారాలన్నింటినీ ఒకటిగా కూర్చి బైండింగ్ పని పూర్తి చేశారు. పుస్తకాలు సిద్ధమయ్యాయి. అప్పటికి ఆ పుస్తకం మీద నిషేధం ఉంది. నిషేధం కారణంగా రహస్యంగా ముద్రించబడిన ఆ పుస్తకం అజ్ఞాతంలోనే ఒక వారంరోజుల్లో మొత్తం కాపీలు అమ్ముడయ్యాయి. ఆ పుస్తకం గోర్కీ అమ్మ. ఆ పనిచేసిన సాహసి- గద్దె లింగయ్యగారు. ఆయన స్వంత ఊరు ఇక్కడకు దగ్గర్లోని యలమర్రు. క్రొవ్విడి లింగరాజుగారి అమ్మ తొలి తెలుగు అనువాదాన్ని అలా బయటకు తెచ్చాడాయన. ఆ తర్వాత ఆయనే బెజవాళ్లో, 'ఆదర్శ గ్రంథమండలి' పేరుతో ఎన్నో ఉత్తమ గ్రంథాలు తెచ్చారు."

హరినారాయణ ఆగి సిగరెట్ వెలిగించుకొని, "అదండీ అమరేంద్ర, దీనిని ఎలా అర్థం చేసుకోవాలంటారు? చుట్టుపక్కల ఊళ్ల నుండి వచ్చిన యువకులు ఏ ఫౌండ్రీలోనో, వర్క్‌షాపులోనో కాకుండా విశాలాంధ్రలో ప్రూఫురీడరు దగ్గర్నుండి ప్యాకింగ్ వరకు ఏదో ఒక పనిలో చేరడం, కొన్నాళ్లు అక్కడ చేసి అక్కణ్ణించి బయటకు వచ్చి మరింకే పని చేయలేనట్టు, నచ్చిన ఒక రచయిత రాతప్రతుల్ని తీసుకొని నానా పాట్లు పడి ఒక పుస్తకం తీసుకురావడం- ఇదీ పని.

"అప్పట్లో ఇక్కణ్ణించే అన్ని దినపత్రికలు, వారపత్రికలు రాష్ట్రమంతా వెళ్లేవి. వాటిల్లో వీరి పుస్తకాల గురించి సమీక్షలు. వాటి ద్వారా ఈ పబ్లిషర్లకు ప్రచారం. ఒక వంద రూపాయలు చేతిలో ఉంటే జయంతి పబ్లికేషన్స్ పెరుమాళ్లుగారు ఒక నాటకం పుస్తకం వేయించేవారు. ప్రింటు వేయించి ఏలూరు రోడ్డులో నూనెగానుగ సెంటర్లో ఒక చిన్నబల్ల వేసుకొని దానిమీద పెట్టి వాటిని అమ్మేవారు. ఎందుకు చెబుతున్నానంటే- అంత సింపుల్‌గా మొదలయ్యాయి ఇక్కడి పబ్లిషర్ల జీవితాలు. అప్పట్లో ఊళ్లలో నాటక ప్రదర్శనలే జన సామాన్యంలో చైతన్యం కలిగించే మీడియం. ప్రగతిశీల భావాలు గల ఒక రచయిత ఆలోచన్లు గ్రామాలలోని జనాల్లోకి వెళ్లడానికి ఇటువంటి పబ్లిషర్ల చిరు ప్రయత్నమే బలమైన వాహిక అయ్యేది. అలా ఇక్కడి సాహిత్యసంబంధమైన పుస్తక పబ్లిషర్లు అంతా ఎంతో కొంత విశాలాంధ్ర నేపథ్యంలో నుంచి వచ్చినవారే.

"ఒక రచయిత రచన ఏ పత్రికలోనో చదివితే దాన్ని తామే పుస్తకంగా తీసుకు రావాలనుకొనే కీర్తి కాంక్ష కూడా ఎంతో కొంత మాకు లేకపోలేదు. ఇక సంపాదన అంటారా, దిగువ మధ్యతరగతికి, ఎగువ మధ్య తరగతికి మధ్య అటూ ఇటూ ఊగిసలాట తప్ప ఇంకేముంటుంది? కాని- అది నేను వేసిన పుస్తకం అని నలుగురిలో చెప్పుకోవడముంది చూశారూ, అది మాత్రం మాకు మాత్రమే స్వంతమైన ఒక పొగరు, ఒక ప్రివిలేజ్, ఇంకా మరేమైనా అనండి. ఇప్పటికైనా చాలా మందిలా ఏ రియల్ ఎస్టేట్టో, ఫైనాన్స్ బిజినెస్సో, మరీ ఇవే కాకున్నా, గైడ్లు, పైరసీ పుస్తకాలు ప్రింటు చేసుకొని కూడా సొమ్ములు చేసుకోవచ్చు. కాని అది అంత అవసరమంటారా? అహ్హా... అహ్హా..." అంటూ నవ్వి మిన్నకుండిపోయాడు.

ఎందుకోసం నేను హరినారాయణని కలుసుకోవాలనుకొన్నానో ఆ సందర్భం రానే వచ్చింది. వెంటనే అడిగేశాను.

"అవునుగాని, మీరు బుచ్చిబాబుగారి కథలు వేయడం ఎలా జరిగింది?"

"సరిపోయింది, చివరికి మీ వేలు నా వైపుకి తిప్పారా?" మళ్లీ అదే నవ్వు.

"చూడండి అమరేంద్ర, మీ మినిష్టర్ చిదంబరం గారు అంటూ ఉండే నైన్ పర్సెంట్ గ్రోత్‌కు మాకు నచ్చిన పుస్తకాలు వేయడం ద్వారా మేమీ గండి మాత్రం కొట్టడంలేదు- సరేనా?"

"యూ ఆర్ వర్కింగ్ ఇన్ ఫైనాన్స్ మినిస్ట్రీ- రైట్," పెద్దగా నవ్వు...

చిరునవ్వుతో నేను అవునన్నట్టు తల ఊపాను.

"మీరు కస్టమ్స్‌లో చేస్తున్నారని మా సముద్రాలు చెప్పాడు. మావాడు మౌని చూడండి. ఏం మాట్లాడ్డు,

కానీ ఘటికుడు. వేటపాలెం లైబ్రరీ, ఇంకా ఎక్కడెక్కడి నుంచో బుచ్చిబాబుగారి కథలు నాకు సేకరించి పెట్టాడు. ఇప్పటికీ అదే తీరు. ఏనాటివో రాతప్రతులైనా సరే ఫలానాచోట ఉన్నాయట అంటే చాలు, ఎలాగోలా వాటిని తెచ్చి ఎవరో ఒకరికిచ్చి దాన్ని పుస్తకం వేయించి తాను ఆనందం పొందుతాడు.''

''అమర్‌గారు మిమ్మల్నేదో అడుగుతున్నట్లున్నారు.'' నా ప్రశ్నను సముద్రాలు హరినారాయణకు గుర్తు చేశాడు.

''అదిగో చూశారా, ఫోకస్ బొత్తిగా తన మీదకి రానివ్వడు. బుచ్చిబాబుగారి గురించి అన్నారు కదా, ఒక పావుగంట క్రిందికెళ్లి ఆ తత్త్వవేత్తలు కవర్‌పేజీ పని చూసుకొని దాన్ని ప్రింటర్‌కు పంపి వస్తాను.''

**4**

క్రింద సముద్రాలు ఇంట్లో లైట్లు ఆరిపోయాయి.

డాబా మీద ఉన్న మా ముగ్గురి చేతుల్లో ఉన్న గ్లాసుల్లో- ఓడ్కా.

హరినారాయణ కొంచెం, కొంచెం సిప్ చేస్తూ మాట్లాడుతున్నాడు. మేము ఇద్దరం ఆయనకు కంపెనీ ఇస్తున్నాము.

''బుచ్చిబాబు అన్నారు కదా- బుచ్చిబాబు నాకు ఒక బలహీనత. ఇంతకన్నా వివరంగా చెప్పడం బహుశా నాకూ చాతకాకపోవచ్చు. ఏ పాశ్చాత్య దేశాల ధోరణుల్ని క్రొత్తగా మనం అలవర్చుకొనే ప్రయత్నం చేస్తున్నామో. అదే పాశ్చాత్య దేశాల తాత్త్విక ధోరణుల్ని అప్పటికే పూర్తిగా ఆయన అధ్యయనం చేసి, వాటి సారాన్ని మన కుటుంబవ్యవస్థ మూసలోకి మలిచి, మానసిక శాస్త్రంలో ఎన్ని అవస్థలు ఉన్నాయో అన్ని నమూనాలతో తన పాత్రల్ని సృష్టించి- మనకది నూటికి నూరుపాళ్లు మనదైన- అంటే నేటివ్ ఆలోచన అన్పించేట్టుగా చూపిన కథకుడు బుచ్చిబాబు.

''కలలో జారిన కన్నీరు అని బుచ్చిబాబు ఒక కథ రాశారు. అముద్రితమది. ఎప్పుడు రాశారో కూడా తెలీదు. నేను దాన్ని బుచ్చిబాబు కథలు ఏడవ సంపుటిలో మొదటి కథగా వేశాను. ఆ కథ ఇలా మొదలవుతుంది,'' అంటూ హరినారాయణ కళ్లు మూసుకొని కొన్ని క్షణాలు అలా ఉండిపోయాడు.

చందమామ మా నడినెత్తిన ఉంది. పట్టపగల్లా వెన్నెల కాస్తూ ఉంది.

ఎదలోని ఉద్విగ్నతకేమో హరినారాయణ పల్చటి మెడ పక్కన రక్తనాళాలు ఉండుండి ఉబుకుతూ ఉన్నాయి. తన కుడిచేతి బ్రొటనవ్రేలు, చూపుడువ్రేలు కలిపి, గాలిలో కదుపుతూ- చెబుతున్నాడు.

''మొగ్గ విడిచి పువ్వవుతుంది.

గడ్డి మీది మంచుకణం కరిగిపోతుంది.

నదిలో పిల్ల కెరటం రాపిడికి ఒడ్డున రాయి కరిగిపోతుంది.

ఇవేవీ మనం చూడం.

ప్రకృతిలో జరిగే మార్పులు ఎప్పుడు ఎట్లా జరుగుతాయో మనకు తెలీదు.

కాని మార్పు జరిగిందని గుర్తిస్తాం.

మానవుడిలో కాలం తెచ్చే మార్పు మానవుడికే తెలియదు...'' ఇలా మొదలవు తుంది ఆ కథ.

''అయితే ఈ రాయి కరగడం ఉంది చూశారూ అమరేంద్రా! అది దానంతటికి అదే జరగదు. ఆ కెరటాలను మనం మనకు తాకనివ్వాలి. అవి మనల్ని ఎంతవరకు కోసుకొని లోపలికి వెళతాయో వెళ్లనివ్వాలి. ఆ కోత వినిర్మాణం కాదు నిర్మాణం. చివరి కంటా మనం ఎలా మిగులుతామో, నిర్ధారించేది మనలోకి మనం ఈ కోతను అనుమతించినపుడే. అటువంటప్పుడే మనిషిలోకి చెలమలు చేరేది. చివరికంటా మనలో ఆ తడి మిగిలేది.

''1942-46ల మధ్య రాసిన బుచ్చిబాబు చివరకు మిగిలేది 2004లో కూడా తిరుపతిలోని వడ్డెర చండీదాస్ వంటి తాత్త్విక రచయిత గదిలో మంచం పక్కన స్టూలు మీద- చివరిదాకా ఆయన చదివిన ఒకే ఒక్క పుస్తకం అయిందంటే- ఈ రాళ్లను కరిగించే కెరటాలకు వయస్సు ఉందనగలమా?

''నన్ను గూర్చి కథ రాయవూ? అంటుంది కుముదం. కాని రాయడు చివరిసారి ఆమెను చూడ్డానికి వెళ్లినప్పుడు నుస్తీతో ఆమె మంచం మీద ఉంటుంది. పక్కన స్టూలు మీద కూర్చుంటాడు. మాటలు కరువవుతాయి. ఆమె ముంజేతి మీద చేయి వేయబోతాడు. ఆమె తన చేతిని దుప్పట్లోకి తీసుకొంటుంది. బయటకు వచ్చేస్తాడు.

''వివాహేతర సంబంధాలు- అమలిన శృంగారం. ఏమిటిది?

''ఎలా సాధ్యమయింది? అవకాశమున్నా కోమలిని తాకకుండా బయటకు వస్తాడు దయానిధి. నిజానికి అమృతంతో గడిపిన రాత్రి అతనికి భయమేస్తుంది. సిగ్గేస్తుంది. 'స్వప్నంలో తెరుచుకొని చూడడం నేర్చుకొన్న నేత్రాలతో ఈ బాహ్య ప్రపంచాన్ని చూడటమా?' అని తనని తానే ప్రశ్నించుకొంటాడు.

సూర్యోదయాన అమృతాన్ని ఎలా చూడగలను? అనుకొంటాడు. తన బనియన్ లోపల ఇరుక్కుపోయిన అమృతం నల్లని పొడవాటి తలవెంట్రుకను తీసి ఒక కవర్‌లో పెట్టుకొని ఆమె పెట్టిలో నుంచి కొంత డబ్బు తీసుకొని హోల్డాల్ పట్టుకొని తెల్లవారక ముందే అక్కణ్ణించి వెళ్లిపోతాడు.

"బందరు నోబుల్ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో ఉండగా బుచ్చిబాబును చదివాను. అప్పట్నించి చదువుతూనే ఉన్నాను. 1939లో ఆయన మరుతుమన్నా మరుపురారు అని ఒక కథ రాశారు. భారతిలో వచ్చింది. నేను నా ఐదవ సంపుటిలో వేశాను దాన్ని.

"కథలో హీరో ఒక తక్కువకులం అమ్మాయిని ఇష్టపడతాడు. అందులో ఒక సన్నివేశంలో ఆ అమ్మాయి తల్లికి, హీరోకి సంవాదం నడుస్తుంది. ఆమె తన కూతుర్ని పెళ్లి చేసుకోమని అతడ్ని ఒత్తిడి చేస్తుంది. అక్కడ మనకు భిన్నమైన బుచ్చిబాబు కన్పిస్తాడు. కథానాయకుడు అంటాడు- 'మేం బ్రాహ్మలం, పైగా కులం మాట అట్లా ఉంచి మీ వ్యవహారాలు, మీరు ఉండే తీరు మావాళ్లకు తెలిస్తే...' అంటాడు.

"అందుకామె ఇంతెత్తున లేచి, 'మీకు కోపం వస్తుందని భయపడ్తున్నానుగానీ మీ కులంవాళ్లే ఈమధ్య బాగా చెడిపోతున్నారు. కానీ మీ మగవారు, పాపం అమాయకులు. అన్నీ వప్పేసుకొని ఏదో చాటు చాటుగా కాలం వెళ్లబుచ్చుతున్నారు. బీదతనం వల్ల మేం అందరి నోళ్లలోనూ పడుతున్నాం. మీరేమో గోప్యంగా ఉన్నారు. అంతే భేదం,' అంటుంది.

"పవిత్రంగా ఉండడానికి, కులానికి ఎటువంటి సంబంధం లేదని నలభైలకు ముందే బుచ్చిబాబు ఎటువంటి నాన్చుడూ లేకుండా తన పాత్రలతో చెప్పిస్తాడు. కథలో ఆ పాత్ర బ్రాహ్మణ కుటుంబాల్లో స్త్రీల గురించి మర్యాదగా మాట్లాడిందా, అమర్యాదకరంగా మాట్లాడిందా అనేది ఆ పాత్ర స్థాయికి సంబంధించిన విషయం. కథలో ఆమెది ఒక మంచి పాత్ర కాకపోవచ్చు. కాని ఆమె ఆ స్థాయిలో మాట్లాడ్డానికి ఆమెను అనుమతించింది- బుచ్చిబాబు. ఈ విషయం మనం విస్మరించకూడదు. అయితే ఆమె చేసిన విమర్శలో నిజాల గురించి కాదిక్కడ చర్చ. ఆయన పాత్రలు వాటి కాలానికంటే ముందుకు వెళ్లి ప్రవర్తించడానికి రచయితగా ఆయన వాటిని అనుమతించడం ద్వారా వాటి సృజన కారుడిగా బుచ్చిబాబు మనకు ఒక దార్శనికుడిగా మిగిలిపోతాడు."

"అయితే సామాజిక న్యాయానికి మన తెలుగు సాహిత్యంలో అర్ధశతాబ్ది క్రితమే చోటుంది అని మీరు అంటున్నారు. సరే, మరి గడిచిన పది పదిహేనేళ్లలో వచ్చిన ఉద్యమ సాహిత్యం మాటేమిటి? ఇది మీరు చెబుతున్న ఆ పరిణామాలన్నింటికీ కొనసాగింపు కాదంటారా?

"ఏమో దీని ఊపు ఉధృతి చూసినప్పుడు నాకైతే అలా అన్పించడం లేదు. అయినా మీరు అంటున్న ఉద్యమ సాహిత్యం కూడా గురజాడ, తాపీల గడపలు దాటి వచ్చిందే కదా. ఇక మీరు చెబుతున్న ఉద్యమ సాహిత్యమంటారా, నాకైతే ఇది ఒక సామాజిక క్రమంలో నుంచి వచ్చినదిగా అన్పించదు. అదే నిజమైతే వాటి లక్ష్యాలు ఇంత స్వల్పకాలికంగా ఉండవు. పైగా దానివల్ల ఒక బలమైన సాంస్కృతిక భూమిక కూడా ఈపాటికే ఏర్పడి, అది స్థిరపడి ఉండవచ్చు. ఒకవేళ అవి రాజకీయ సమీకరణాలలో నుంచి వస్తే వచ్చి ఉండొచ్చు. చెప్పలేం. అయినా ఒక్కొక్కసారి రెండూ సమాంతరంగా ఏకకాలంలో పనిచేస్తూ ఒకదానిని ఒకటి ఓవర్‌ల్యాప్ కూడా చేయొచ్చు కదా? అన్నింటికీ అంత స్పష్టమైన విభజన రేఖలు కూడా మనం గీయలేం. అయినా ఇప్పుడు ధ్వని ప్రధానమై పోయింది."

ఇంటి ముందు కారాగిన శబ్దం.

"అరవింద్ వచ్చినట్లున్నాడు," హరినారాయణ.

కళ్లు మూసుకొని కూర్చుని మా ఇద్దరి కబుర్లు వింటున్న సముద్రాలు లేచి పిట్టగోడ దగ్గరకు వెళ్లి కాంపౌండ్ గేట్ వైపుకు చూస్తూ, "పైకి రండి. ఇక్కడున్నాం," అన్నాడు.

పైకి వచ్చిన క్రొత్త వ్యక్తిని, "అరవిందరావు, ఎమ్మే ఎంఫిల్- ఇంగ్లీష్ లిటరేచర్, ఎం.బి.ఎ.చేసి మావాడు లిటరేచర్, బిజినెస్ మేనేజిమెంట్ రెండింటినీ సమపాళ్లలో బ్లెండ్ చేస్తూ బుక్ ట్రేడ్ చేస్తున్నాడు. తక్కువ కాలంలో ఎక్కువ మంచి పుస్తకాలు వేశాడు. బహుశా ఈ ఊరు నుండి మా తర్వాత తరం పబ్లిషర్స్‌లో మంచి అభిరుచి, చక్కటి వ్యాపారదక్షత ఉన్న పబ్లిషర్‌గా మా అరవింద్ స్థిరపడతాడు," అంటూ నన్ను కూడా అరవింద్‌కు పరిచయం చేశాడు, హరినారాయణ.

"పోయిన డిసెంబర్లో యు.ఆర్. అనంతమూర్తి గార్ని కలవడానికి బెంగుళూరు వచ్చాను. అప్పుడు అక్కడ ఆయనతో మాట్లాడుతున్నప్పుడు మీ పేరు విన్నాను. అక్కడున్న వాళ్లలో కూడా ఎవరో అన్నారు, "ఆయన మీ తెలుగాయనే, మీకు తెలియదా?' అని. మన దౌర్భాగ్యమే అది కదా. పొన్లెండి ఇంత స్ట్రేంజ్‌గా,

ఇన్ ఫార్మల్‌గా ఇక్కడ మీరు కలవడం కూడా చాలా బావుంది.''

అరవిందరావు మాటల్లో ప్రొఫెషనలిజంలో కూడా నిజాయితీ కన్పించింది.

''అమరేంద్రగారు మన సముద్రాలు ఫ్యాక్టరీ ప్రొడక్టే,'' నవ్వుతూ అన్నాడు హరినారాయణ.

నవ్వులు... నవ్వులు...

''మీరిద్దరూ కలిసి ఆయన్ని చాలాసేపు కూర్చో బెట్టేసినట్టున్నారు,'' అరవింద్.

''లేదు అరవింద్- ఓడ్కానే. అది కూడా రెండు పెగ్గులే తీసుకొంది. వాళ్లిద్దరూ ఊరికే నాకోసం గ్లాసులు పట్టుకొని కూర్చున్నారు.

''కవర్‌పేజీ మిషనెక్కిందా?'' హరినారాయణ అడిగాడు.

''ప్రింటింగు జరుగుతూ ఉంది. మొదలయ్యాకే బయల్దేరి వచ్చాను.''

''లేదులెండి. నేనే హరినారాయణగారి టైం చాలా తీసుకొన్నాను. చాలా విషయాలు అడిగి మరీ ఆయనతో చెప్పించుకొన్నాను. కేవలం ఒక ట్రేడ్‌గా మాత్రమే అందరూ చూసే బుక్ పబ్లిషింగ్ యాక్టివిటీలో ఉండే ఎమోషనల్ ఎటాచ్‌మెంట్ ఎటువంటిదో కూడా కొంత చూడగల్గాను. ఆయన చెప్పిన వాటిలో ఏవో కొన్ని మళ్లీ నేను ఎప్పుడైనా ఎక్కడైనా సందర్భం వస్తే రాస్తే రాయవచ్చు కదా. తెలుగు ముద్రణ మనకు తెలిసిన దగ్గర్నుండి, మీ ఊరు ప్రతి తరానికీ అందిస్తున్న భావ ధార- ఒక రకంగా ఆ ఊళ్లో అంతా వ్యాపారం అనే అపవాదు కారణంగానే- నిజానికి ఇంత స్వచ్ఛంగా సమకాలీనంగా ఉందేమో.''

అందరం లేచాం.

''మీ ప్రోగ్రాం ఏమిటి?'' అరవింద్ అడిగాడు.

''రేపు హైదరాబాద్ వెళ్లాలి. ఎల్లుండే ఓరియంట్ లాంగ్మన్ వాళ్లు ఒక ప్రాజెక్టు డిస్కషన్‌కు రమ్మని అడిగారు.''

''అయితే ఉదయం మా ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం. నేనొచ్చి మిమ్మల్ని పికప్ చేసుకొంటాను,'' అన్నాడు అరవింద్.

కుడిభుజం మీద చేయి వేసి సముద్రాలును దగ్గరకు తీసుకొని నా కుడిచేత్తో తన భుజాన్ని మెత్తగా నొక్కాను. నిర్మలమైన ఆనందం తప్ప ఆ ముఖంలో మరే భావం కన్పించ లేదు.

ముగ్గురం బయల్దేరాం.

అరవింద్ కారు నా హోటల్ వైపు బయల్దేరింది.

## 5

హెల్త్ యూనివర్సిటీకి ఎదురుగా రెండు అంతస్తుల్లో ఉంది అరవింద్ పుస్తకాల షాపు. పై ఫ్లోర్‌లో ఇల్లు. టిఫిన్, కాఫీలు అయ్యాక హాల్లో కూర్చుని కబుర్లలోపడ్డాం. హరినారాయణ కూడా వచ్చారు. మాటల్లో నా సాహితీవ్యాసాలు 'కాలం'లో నేను రాసిన నా పరిశీలనల గురించి అరవింద్ భార్య ఉషారాణి పలుమార్లు ప్రస్తావించింది. అనుకోకుండా నేను అక్కడ ఉన్న ఆ సందర్భంలో, ఆమె ఎంపిక చేసుకొన్నట్లు చేసిన ఆ రెండుమూడు ప్రస్తావనలు కూడా నిజానికి నేను కూడా నాలో నేనే కించిత్ గర్వపడేవి! ఆ సందర్భం నాకు నచ్చింది. మేమంతా మాటల్లో ఉండగా ఏదో ఫోన్ వచ్చినట్టు అరవింద్‌ను ఇంట్లోకి పిలిచారు. టీపాయ్ మీద ఉన్న ఆ రోజు పేపర్లు చూస్తున్నాను. అరవింద్ ఇంట్లో ఏదో ఇంటర్నేషనల్ కాల్ మాట్లాడుతున్నట్లు అర్థమవుతూ ఉంది. అరవింద్ ఇంట్లో వాళ్లు ఒకరి తర్వాత ఒకరు మాట్లాడుతున్నారు. ప్రత్యేకంగా ఆలకించక పోయినా వాళ్ల మాటలు చెవిన పడుతూనే ఉన్నాయి. ఐదు నిముషాలు- ముక్కలు, ముక్కలుగా ఒకవైపే వినడం సాధ్యమైన ఫోన్ సంభాషణలో పెళ్లి సంబంధం, పుస్తకాలు చదవడం- ఈ రెండే ప్రధానమైన విషయాలుగా అర్థమయింది. చిత్రమైన ఈ రెండింటి కాంబినేషన్ మీద నుండి ఆరోజు హిందూ బుక్ రివ్యూ పేజీలో వచ్చిన సమీక్షలు మీదకి దృష్టి మళ్లించాను.

మాట్లాడ్డం అయిపోయింది కాబోలు. ఇంతలో అరవింద్, వెనుక అతని భార్య ఉషారాణి ఒకరి తర్వాత ఒకరు హాల్లోకి వచ్చి మా వద్ద కూర్చున్నారు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

''సారీ, స్మాల్ ఇంటరప్షన్,'' నొచ్చుకొంటున్న ట్లుగా అన్నాడు అరవింద్.

నా ముఖానికి అడ్డుగా ఉన్న పేపర్లో నుండి దృష్టి మళ్లించి నేను వాళ్లిద్దరి వైపు చూశాను. సిటవుట్లో నిలబడి ఉన్న హరినారాయణ చేతిలో సిగరెట్ బయటకు విసిరి లోపలికి వచ్చాడు.

ఎందుకో ఉషారాణి చొరవ చేసింది.

''అరవింద్ వాళ్ల ఆఖరి చెల్లి ఫ్లోరిడాలో ఎమ్మెస్ చేస్తోంది. చికాగోలో ఎమ్మెస్ చేసి అక్కడే జాబ్ చేస్తున్న అతన్ని చూశాం. ఈ అమ్మాయేమో చదువయ్యాక ఇండియాకి వచ్చి ఇక్కడే జాబ్ చేస్తాననంటుంది. అతనూ వచ్చేస్తాట్ట. మంచి ఫ్యామిలీ. అబ్బాయి ఫాదర్ సెంట్రల్ గవర్నమెంటులో క్లాస్ వన్ ఆఫీసర్‌గా చేసి రిటైర్

అయ్యాడు. ఎంక్వైరీ చేశాం. ఆయనకి కరప్షన్ బ్యాగ్రౌండ్ లాంటివేవీ లేవని తెలిసింది. అయినా అసలు ఆ అబ్బాయి హాబీలు ఏమిటో తెలుసుకో వదినా అంటుంది. ఏమంటే- బుక్ రీడింగ్ అలవాటు లేకపోతే రేపు మనందరం ఒకచోట కూర్చున్నప్పుడు మనమంతా మాట్లాడుకొంటూ ఉంటే అతనూ మనతో జాయిన వ్వాలి కదా అంటుంది. అది కూడా ఒక విషయమేనా అని మొదటిసారి విన్నప్పుడు మాకు అన్పించినా, ఆలోచిస్తున్నకొద్దీ తను అంటున్నది కూడా నిజమే కదా అన్పిస్తుంది.

"అరవింద్ కూడా ఎటూ చెప్పలేకపోతున్నాడు. కజిన్స్, వాళ్ల పిల్లలు అంతా కలిసి వీళ్లు నలభైమందికి పైగా ఉన్న కుటుంబం. చదవడం ఫ్యామ్లీ కల్చర్‌లో భాగమైపోయింది. ఇప్పుడు తను చేసుకోబోయే అతనికి కనీసం అటువంటి ఆసక్తి కూడా లేకపోతే తను ఒక్కతే ఇంతమందిలో వేరైపోతానేమోనని మా మంజరి భయం. ఈయనేమో ఎరేంజ్డ్ మ్యారేజెస్‌లో ఇలాంటి వన్నీ ఎక్కడ కుదురుతాయి, అంటారు," అరవింద్ వైపు ఆమె అభిమానంగా చూస్తూ క్లుప్తంగా సమస్య ఏమిటో చెప్పింది.

సోఫాలో కొంచెం జారగిలబడి రెండు కాళ్ల మీద రెండు అరచేతులు ఉంచుకొని అరవింద్ మౌనంగా కూర్చుండిపోయాడు. మొదటిసారి ఏదో ఫార్మాలిటీ కోసం ఇంటికొచ్చిన గెస్ట్ ముందు ఈ ఇంటి సమస్యను అతని భార్య మరీ భోళాగా మొత్తం చెప్పడం అతనికి అసౌకర్యంగా అన్పించిందేమో- అని నాకనిపించింది.

హరినారాయణకు విషయం ఇంతకు మునుపే తెలుసులాగుంది. తనేం మాట్లాడ్డం లేదు. పరిష్కారం కాకపోయినా నేనేమైనా పనికొచ్చేముక్క ఏదైనా చెబుతానేమోనని ఆమెగానీ కనిపెడుతుందా అని నాకప్పుడు తట్టింది.

"వాళ్లిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లేనా?" అడిగాను.

"అవునండీ," అరవింద్ ఇక ఉషకు అవకాశం ఇవ్వలేదు.

అయినా నన్ను వినాలని ఉన్నట్టు వారిద్దరి తీరు చెబుతూనే ఉంది.

"ముందుగా నేను మీకు ఒక విషయం చెప్పాలనుకొంటున్నాను. మీ మంజరి అభ్యంతరాన్ని మీరు సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం మాత్రం ఉంది. ఫ్లోరిడాలో, ఇంకా చాలాచోట్ల ఈ రంగంలో పనిచేస్తున్న చాలామంది మనవాళ్లు నాకు తెలుసు. స్టూడెంటుగా ఉంటూనే మీ చెల్లి అక్కడ పరిస్థితుల్ని చాలా బాగా విశ్లేషించుకొంది. అయితే తన భయాందోళనలను మీరు కొట్టివేస్తారనో లేదా అతిగా ఊహించుకొంటున్న స్వల్ప విషయాలనుకొంటారనో తాను అనుకొని, తాను అనుకొంటున్నదేమిటో బయటకు చెప్పకుండా, రేపతను మన అందరిలో కలవలేకపోతే ఎలా అంటూ మొత్తం సమస్యకు ఆమె ఒక సాఫ్ట్ డైమన్షన్ ఇచ్చింది. అసలు సమస్య దాని క్రింద ఘనీభవించి ఉంది. ఆమె మీతో అంటున్న సమస్య, 'ఇట్స్ ఓన్లీ ఎ టిప్ ఆఫ్ యాన్ ఐస్‌బర్గ్.'

"నేను చెప్పబోతున్న విషయాన్ని మీరు ఎలా అర్థం చేసుకొంటారోగాని, దీని మీద ఆలోచన అయితే చేస్తారన్న నమ్మకమైతే నాకు ఉంది. కొంతకాలంగా మనం చూస్తున్నది ఫాస్ట్ ఫార్వర్డ్ అనే మనలో చాలా మందిమి ఇప్పటికీ నమ్ముతూ ఉన్నాము. కానీ నిజానికి జరుగుతున్నది రివైండ్. స్త్రీ పురుష సంబంధాలే ఈ మానవ సమాజ చలనానికి మూల హేతువులని మనం ఇప్పటికీ నమ్ముతున్నాం. కనుక నేనీ విషయం చెప్పడానికి వెనుకాడ్డం లేదు.

"స్త్రీ పురుష జీవితాల మధ్య వైరుధ్యాలు భౌతిక పరమైనవి. అవి ప్రకృతిసిద్ధంగా ఉన్నవి. నాగరికతల పరిణామంలో స్త్రీ పురుషునితో సమానం కావాలనే డిమాండ్‌ను మనం సహజమైనదిగానే ఆహ్వానించాం. కానీ దానివల్ల ప్రకృతి సిద్ధమైన స్త్రీ పురుష వైరుధ్యాలు క్రమంగా సన్నగిల్లడం మొదలైంది. ఎప్పుడైతే స్త్రీ పురుషుడితో సమాన ప్రాతిపదికను డిమాండ్ చేయడం మొదలైందో, అప్పుడే పురుషుడికి ఐడెంటిటీ క్రైసిస్-సమస్య మొదలయింది. సహజాతమైన తన అహాన్ని వదులుకోలేక అతడు ఇప్పుడు కొత్త మార్గాలు వెతుక్కోవలసి వచ్చింది. తన అహాన్ని ప్రదర్శించడానికి తన ప్రత్యర్థి అయిన స్త్రీ బలహీనతను ఎత్తి చూపడానికి ఇప్పుడు అతనికి మరింత రూపగాంభీర్యం కూడా అవసరం అయింది. అందుకు 'మ్యాన్' మళ్లీ తను 'డెమన్' కావడం ద్వారా తన పురుష ఆధిక్యతను స్త్రీ పైన మునుపటిలా నిలుపుకోవచ్చు అనుకొంటున్నాడు. పరుగే తెలుసుగానీ ఆగడం ఎక్కడో తెలియని ఈ నాగరికత పరిణామంలో పురుషుడు మళ్లీ ఇలా మధ్యయుగాల నాటి బలాఢ్యుల సంస్కృతిలోకి నెట్టివేయబడటాన్ని మనం రివైండ్ అనాలా లేక ఫాస్ట్‌ఫార్వర్డ్ అనాలా?

"నిజానికి మంజరి భయాందోళనకు మూలాలు చాలా చాలా లోతైనవి. పరిధులు దాటి పెరుగుతున్న

జిమ్ కల్చర్‌లో క్రమంగా మన యువకుల దేహ దారుఢ్యం పెరుగుతూ ఉంటే- మనో వైశాల్యం తగ్గుతూ వస్తున్నది. ఆపైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ వారి మస్తిష్కాల మీద పెంచుతున్న ఒత్తిడి వారు దానిని తట్టుకోగలిగే స్థాయిలను దాటి మించి పోతూ ఉంది.

''ఒకప్పుడు కేవలం ఆటల మైదానాలలో క్రీడా కారులకే పరిమితమైన ఎమోషనల్ బాడీ లాంగ్వేజ్ క్రమంగా ఇప్పుడు వర్క్ ప్లేస్‌లో ప్రొఫెషనల్స్‌కి కూడా రావడం మనం గమనించాల్సి ఉంది. ప్రతి ఎమోషన్ని భౌతికంగా వ్యక్తీకరించడం తప్పనిసరి అనే దశను ఇప్పుడు మనం చూస్తున్నాం. ఒకసారి అది ఒక అవస రంగా మారాక లైఫ్ పార్ట్‌నర్ మీద కలిగే ఆగ్రహాన్ని ఎలా వ్యక్తీకరించాలి? వాళ్లు ఏ దేశంలో ఉన్నా వాళ్ల భర్త హోదా మూలాలు మాత్రం ఈ దేశానివే. కనుక తన పై చేయిని నిరూపించుకోవడానికి ఏదో ఒక టార్చర్‌కు ఆమెను గురి చేయాలి. చట్టానికి భయపడే వాడైతే మెంటల్ టార్చర్ చేస్తాడు. ఆ భయం కూడా లేనివాడు నేరుగా ఫిజికల్ ఎటాకే మొదలు పెడతాడు. పెరుగు తున్న గృహహింసను నిలువరించడానికి మనకున్న ఇన్ని టెక్నాలజీలలో దేనిలో ఉంది పరిష్కారం? ప్రొఫెష నల్ కోర్సులు తప్ప మన పిల్లలతో మనం మరింకేమీ చదివించడం లేదు. వీటిలో ఏ కోర్సూ మానవ సంబం ధాల గురించి మనకు బోధించడంలేదు. మరి అవి తెలుసుకోవడానికి రేపటి తల్లిదండ్రులు ఏం చదవాలి? 'అతనికి బుక్ రీడింగ్ అలవాటు ఉందేమో తెలుసుకో వదినా?' అని మీ మంజరి అడిగిన ప్రశ్నే, దానికి జవాబు.

''కేవలం పుస్తకాలు చదివే అలవాటు ఉండటం- సర్వరోగ నివారిణి అని నేను చెప్పడంలేదు. ఆ మాట కొస్తే సాహిత్యం మీద ఆసక్తితో విపరీతంగా చదివి కూడా జీవితాల్ని ఛిద్రం చేసుకొన్నవారు కూడా ఎందరో ఉన్నారు. అయితే విశేషం ఏమిటంటే- మనకంటే మన తర్వాతి తరంలో నిజాయితీ ఎక్కువ. వారికి నచ్చింది చేయడమే తప్ప, ఒకటి చెప్పి మరొకటి చేయాల్సిన ఐడియలాజికల్ ఆబ్లిగేషన్స్ వాళ్లకు ఇప్పుడు లేవు. అయితే మున్ముందు వాళ్లు ఎదుర్కొనే జీవన సంక్లి ష్టతలు కూడా అలాగే ఉంటాయి. వాళ్ల సమస్యలకు పరిష్కారాలు కూడా వాళ్లు తమ సమకాలీన రచయితల రచనల నుంచే వెతుక్కొంటారు. ఎటొచ్చీ మనం చేయవలసిందల్లా వాళ్లు పిల్లలుగా ఉన్నప్పుడే మనం వాళ్లను పుస్తకాల దగ్గరకు చేరిస్తే, ఆ తర్వాత ఆ పుస్తకాలే వారికి దిశను నిర్దేశిస్తాయి.

''అరవింద్‌గారూ, మన కుటుంబవ్యవస్థను, మన మానవ సంబంధాలను ఆసాంతం కుదిపేటంతగా పరిణామాలు చోటు చేసుకొన్న ప్రతి చారిత్రక సంద ర్భంలోనూ కొందరు మానసికమైన బలహీనతలతో అతలాకుతలమైపోతారు. అయితే ఎంతటి జటిలమైన సమస్యకైనా మనం వెతుక్కోగలిగితే మన అనుభవా ల్లోనే వాటికి పరిష్కారాలు దొరుకుతాయి. జీవితం పట్ల ఒక స్పష్టమైన వైఖరి, ఒక దృక్పథం ఉన్న అమ్మాయి కనుకనే మంజరి తన ప్రాధాన్యతను ముందుగానే మీతో చెప్పింది. ఇక ఆమె అభిప్రాయాలకు మీరు ఇచ్చే గౌరవం ఎటువంటిది అనే ప్రశ్నకు సమాధానం మీరు నాకు చెప్పనక్కర్లేదు.

''అయితే నిజానికి ఇది కేవలం మంజరి ఒక్క దాని సమస్య అని నేను అనుకోవడం లేదు. మన కుటుంబవ్యవస్థ పట్ల నమ్మకం, గౌరవం ఉన్న మంజరిలా ఆలో చించగలిగిన వాళ్లను కొద్దిమందినైనా మనం మనమధ్య స్వతంత్రంగా ఎదగనివ్వాలి. అప్పుడే వాళ్లు తమ తర్వాతి తరంలో కూడా ఈ భావధార స్వేచ్ఛగా ప్రవహించడానికి అవసరమైన మడులు కట్ట గలుగుతారు. మున్ముందు మళ్లీ మన మట్టికి చేరువైన కొత్త విత్తనాలు మొలకెత్తడానికి ఆ ప్రవాహాలు తడిని అందించగలుగుతాయి.

''మంజరి ఈ తోటలో మీరు పెంచిన మొక్క. దానికి మొగ్గలు వస్తున్నప్పుడు అవి, ఏ పరిమళాలు వెదజల్లాలో ఆ మొక్కనే నిర్ణయించుకోనివ్వండి. అది తోట చేయవల్సిన పని కాదు.''

వాళ్లందరి వద్ద సెలవు తీసుకొని అక్కణ్ణుంచి బయలుదేరాను.

*రచన మాసపత్రిక, అక్టోబర్ 2007*

